
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మంచిర్యాల జిల్లా వార్తలు
5
బుధవారం 21 ఫిబ్రవరి 2024



పని చేసే ఉద్యోగికి గుర్తింపు ఉంటుంది

మంచిర్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 20: వ్యవస్థ కోసం పనిచేసే ఉద్యోగికి గుర్తింపు ఉంటుందని జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మీఓదెలు తెలిపారు. మంగళవారం జడ్పీ కార్యాలయంలో బదిలీపై వెళ్లిన సీఈవో నరేందర్, డీఆర్‌డీవో శేషాద్రి, ఎంపీడీవో, ఎంపీవోలకు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించి సన్మానించారు. చైర్‌పర్సన్ మాట్లాడుతూ బదిలీపై వెళ్లిన అధికారులు జిల్లా అభివృద్ధికి ఎంతో కృషి చేశారని, వారి సేవలు మర్చిపోలేనివని పేర్కొన్నారు. సీఈవో గణపతి, అధికారులు, జెడ్పీటీసీలు సత్యనారాయణ, సత్తయ్య, రవి, చంద్రశేఖర్, తిరుపతి పాల్గొన్నారు.

- సమ్మక్క-సారలమ్మ జాతరకు ఏర్పాట్లు పూర్తి
- నేడు గద్దెపైకి రానున్న సారలమ్మ
- 22న సాయంత్రం సమ్మక్క
- 23న కొలువుదీరనున్న తల్లులు
- వేలాదిగా తరలిరానున్న భక్తులు

వనదేవతల జాతరకు వేళాయె



మంచిర్యాలలో అమ్మవార్ల గద్దెలు

మంచిర్యాల, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): సమ్మక్క-సారలమ్మ జాతరకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. బుధవారం జాతర ప్రారంభమై ఈ నెల 24 వరకు జరుగనుంది. బుధవారం సాయంత్రం 6 గంటలకు సారలమ్మ, గోవింద రాజు, పగిడిద్ద రాజులు గద్దెల పైకి చేరనుండగా, 22న సాయంత్రం సమ్మక్క రానున్నారు. 23న అమ్మ వార్లకు భక్తులు మొక్కులు సమర్పించనుండగా, 24న దేవతలు వన ప్రవేశం చేయనున్నారు. జిల్లా కేంద్రంలో గోదావరి ఒడ్డున జాతర ఏర్పాట్లు చేయగా, ఒక రోజు ముందు నుంచే భక్తులు తరలి వస్తున్నారు. గోదావరి తీరంలో ప్రత్యేకంగా గుడారాలు వేసుకోగా, మూడు రోజుల పాటు ఉండనున్నారు.

ఇతర రాష్ట్రాల నుంచి భక్తుల రాక ...

సమ్మక్క-సారలమ్మ జాతరను జిల్లా వ్యాప్తంగా పలు చోట్ల నిర్వహించనున్నారు. జిల్లా కేంద్రంలోని గోదావరి నది ఒడ్డున దేవాదాయశాఖ ఆధ్వర్యంలో అధికారికంగా జాతర నిర్వహిస్తుండగా, మిగతా ప్రాంతాల్లో కమిటీలు వేసుకొని ఏర్పాట్లు చేస్తున్నారు. సింగరేణి ప్రాంతాలైన శ్రీరాంపూర్, మందమర్రి, బెల్లంపల్లి ఏరియాల్లో సంస్థ ఆధ్వర్యంలో జాతర జరుగుతుంది. మంచిర్యాలలో జరిగే జాతరకు దాదాపు ఐదు లక్షల మంది భక్తులు హాజరవుతారని నిర్వాహకులు భావిస్తున్నారు. మంచిర్యాలకు జిల్లా నుంచేగాక చుట్టు పక్కల జిల్లాలతోపాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి భక్తులు హాజరవుతారు.

పూర్తయిన పనులు...

జిల్లా కేంద్రంలో జరిగే జాతర పనుల కోసం పంచాయతీరాజ్ శాఖ రూ.75 లక్షలు వెచ్చించారు. గోదావరి నది ఒడ్డున ఉన్న సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, జంపన్న, నాగులమ్మ, గోవిందరాజుల గద్దెలకు రంగులు వేస్తున్నారు. లైటింగ్ కోసం నదితోపాటు పరిసరాలలో స్తంభాలు ఏర్పాటు చేశారు. జాతరకు వచ్చే భక్తుల బసతోపాటు వాహనాల పార్కింగ్, దుకాణ సముదాయాల కోసం మాతా శిశు సంరక్షణ కేంద్రం సమీపంలోని భూములను చదును చేస్తున్నారు. గోదావరి పుష్కరఘాట్ సమీపంలో టాయిలెట్లు, మహిళలు దుస్తులు మార్చుకొనే గదుల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. లక్షెట్టిపేట మం డలంలోని ఇటిక్యాల, బెల్లంపల్లి, మందమర్రి, నస్పూర్, తదితర ప్రాంతాల్లో జాతరలు జరుగుతున్నాయి. మంచిర్యాల, ఇటిక్యాల మినహా ఇతర ప్రాంతాల్లో జరిగే జాతరలను సింగరేణి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు.

పుణ్యస్నానాలకు నీటి కరువు...

మంచిర్యాల వద్ద గోదావరిలో నీరులేని కారణంగా పుణ్యస్నానాలు ఆచరించే భక్తులకు ఇబ్బందులు తలెత్తనున్నాయి. కాళేశ్వరం ప్రాజెక్టుల సముదాయం కుంగిపోవడంతో నీటిని దిగువకు వదిలిపెట్టారు. దీంతో గోదావరి పూర్తిగా అడుగంటింది. ఎగువన ఎల్లంపల్లి ప్రాజెక్టులో నీటి మట్టం డెడ్ స్టోరేజీకి చేరడంతో గోదావరిలోకి నీరు విడిచే పరిస్థితి లేదు. జాతర సమయంలో ప్రాజెక్టు నుంచి గోదావరిలోకి నీరు విడుదల చేస్తుండగా, భక్తుల స్నానాలకు ఇబ్బందులు ఏర్పడేవికావు. ప్రత్యామ్నాయంగా నది ఒడ్డున పుష్కరఘాట్ల వద్ద మున్సిపాలిటీ ఆధ్వర్యంలో స్నాన ఘట్టాలకు మరమ్మతులు చేస్తున్నారు. కుళాయిలు బిగించడం ద్వారా భక్తులు స్నానాలు ఆచరించేందుకు ఏర్పాట్లు చేశారు.

సమ్మక్కసారలమ్మ జాతర పోస్టర్ల విడుదల

మంచిర్యాల కలెక్టరేట్: కలెక్టరేట్‌లో మంగళవారం సమ్మక్క సారలమ్మజాతర పోస్టర్లను కలెక్టర్ బదావత్ సంతోష్ విడుదల చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ జాతరకు ఏర్పాట్లు చేశామన్నారు. భక్తులకు తాగునీరు, విద్యుత్ సౌకర్యాలు కల్పించామ న్నా రు. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహిస్తామన్నారు. డీఈవో యాదయ్య పాల్గొన్నారు.

చెన్నూరు: సుబ్బరాంపల్లి సమ్మక్క సారలమ్మ గద్దెలకు ఎంతో చరిత్ర ఉంది. పుట్టు సుబ్బరాంపల్లి మెట్టు మేడారంగా పేరు పొందింది. జిల్లాతో పాటు మంథని, కరీంనగర్, మహారాష్ట్రలోని అంకీస, ఆసరెల్లి ప్రాంతాల నుంచి భక్తులు వస్తుంటారు. చిన్న పిల్లల పుట్టు వెంట్రుకలు సమర్పిస్తారు. కిష్టంపేట సమీపంలోని జాతీయ రహదారి పై జాతర నిర్వహణకు సిద్ధంచేశారు.

మందమర్రి టౌన్: పట్టణంలోని పాలవాగు ఒడ్డున బుధవారం నుంచి శనివారం వరకు జరిగే సమ్మక్క సారలమ్మ జాతరకు సర్వం సిద్ధమైంది. వచ్చే భక్తుల కోసం సింగరేణి యాజమాన్యం అన్ని ఏర్పాట్లు చేసింది. స్నాన ఘాట్‌లు, తాత్కాలిక మరుగుదొడ్లు, తాగు నీరు సరఫరా, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసింది. ఏర్పాట్లను మందమర్రి జీఎం మనోహర్ పరిశీలించారు. జాతరకు సంబంధించి ఆయా గనుల, డిపార్టుమెంట్ల నుంచి పలువురు ఉద్యోగులను విధులకు కేటాయించారు. జాతరలో బెల్లం, కొబ్బరికాయలు, చికెన్ సెంటర్లు, దుకాణాల ఏర్పాటుకు స్థలాలను కేటాయించారు. సర్కిల్ పరిధిలోని పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు. బుధవారం సాయంత్రం మేడారంకు చెందిన పూజారులు ప్ర త్యేక పూజలు నిర్వహించి సారలమ్మను తీసుకువస్తారు.

మంగళవారం కంకవనం పూజలు నిర్వహించారు. జీఎం మనోహర్, ఎస్‌వోటూ జీఎంలు హాజరై పూజలు చేశారు. జీఎం మాట్లాడుతూ బుధవారం నుంచి శనివారం వరకు నాలుగు రోజుల పాటు జరిగే జాతరకు వచ్చే భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. బుధవారం సారలమ్మను గద్దెకు తీసుకురావడం జరుగుతుందన్నారు. పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్,ఏఐటీయూసీ నాయకులు ఆంజనేయులు, అధికారులు గోవిందరావు, మేనేజర్ జయంత్ తదితరులు పాల్గొన్నారు.

మేడారం తరలిన భక్తులు

ములుగు జిల్లా మేడారంలో జరిగే సమ్మక్క సారలమ్మ జాతరకు మందమర్రి ఆర్టీసీ బస్టాండ్ నుం చి భక్తులు ప్రత్యేక బస్సుల్లో బయల్దేరారు. మొదటగా పూజలు చేసి కొబ్బరికాయలు కొట్టారు. కొందరు భక్తులు పూనకాలతో తూలిపోయారు. భక్తుల కోసం ఆర్టీసీ బస్టాండ్‌లో టెంట్లు ఏర్పాటుచేశారు. టికెట్ ధరల పట్టికను అందుబాటులో ఉంచారు. మహిళలకు ఆధార్‌కార్డు ఆధారంగా ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. మందమర్రి నుంచి దాదాపు 70 బస్సులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణం జాతరకు వెళ్తున్న భక్తులతో సందడిగా మారింది.

కంకవనం పూజ మహోత్సవం

రామకృష్ణాపూర్: రామకృష్ణాపూర్ సమీపంలోని ఆర్కే 1ఏ గని వద్ద సమ్మక్క సారలమ్మ జాతరలో భాగంగా కంకవనం పూజ మహోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా జీఎం మనోహర్, ఎస్‌వోటూ జీఎం రాజేశ్వర్ రెడ్డిలు పూజలు చేశారు. ఏఐటీయూసీ బ్రాంచి సెక్రెటరీ ఆంజనేయులు, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, ఆర్కే ఓసీ ప్రాజెక్టు అధికారి గోవిందరావు, ఆర్కే 1 గని మేనేజర్ జయంత్, యూనియన్ నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.





మంచిర్యాలలో పోస్టర్లను విడుదల చేస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్, మందమర్రిలో కంకవనం తీసుకువస్తున్న నాయకులు, మందమర్రిలో మేడారం వెళ్లే బస్సుకు పూజలు నిర్వహిస్తున్న భక్తులు

నేడు సత్యదేవుడి కల్యాణం



దండేపల్లి, ఫిబ్రవరి 20: గూడెం రమా సహిత సత్యనారాయణస్వామి బ్రహ్మోత్సవంలో భాగంగా బుధవారం సాయంత్రం స్వామివారి కల్యాణం వైభవంగా జరగనుంది. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించి, ప్రత్యేక ఏర్పాటు చేయడంలో సిబ్బంది నిమగ్నమయ్యారు. స్వామి కల్యాణం జరిపిం చేందుకు గుట్టపైన కల్యాణ మండపం ఏర్పాటు చేశారు. భక్తులకు ఇబ్బం దులు కల్గకుండా ఏర్పాట్లు చేస్తున్నామని ఈవో సంకటాల శ్రీనివాస్ పేర్కొ న్నారు. రూ.500 చెల్లించి కల్యాణంలో పాల్గొన్న దంపతులకు లడ్డు ప్రసాదం, శేషవస్త్రాలు అందజేయనున్నట్లు ఈవో తెలిపారు.

బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ప్రత్యేక పూజలను వైభవంగా నిర్వహించారు. భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. సప్తహ భజన కార్యక్రమం నిరంతరం కొనసాగుతుంది.

వైభవంగా కాలభైరవ హోమం



పారుపెల్లిలో కాలభైరవ స్వామికి పూజలు, హోమం నిర్వహిస్తున్న వేద పండితులు

కోటపల్లి, ఫిబ్రవరి 20: భీష్మ ఏకాదశి పురస్కరించుకుని మంగళవారం పారుపెల్లి కాలభైరవ ఆలయంలో శృంగేరి శారద పీఠ ఆస్థాన పండితులు బాచంపల్లి సంతోష్‌కుమార్‌శాస్త్రి ఆధ్వర్యంలో హోమం నిర్వహించారు. నర దోష నివారణ నిమిత్తం కాలభైరవ హోమం నిర్వహించగా భైరవ నామస్మరణతో ఆలయ ప్రాంతం మార్మోగింది. పూర్ణాహుతి అనంతరం సంతోష్‌కుమార్ శాస్త్రి భైరవ స్వామికి అభిషేకం, పూజలు జరిపారు. అనంతరం ఆయన భక్తులకు ప్రవచనాలను బోధించారు. చెన్నూరు, కోటపల్లి మండలాల నుంచి భక్తులు హాజరు కాగా వారికి అన్నదానం చేపట్టారు. వేద పండితులు పులి సీతారాంశర్మతో పాటు పలువురు భక్తులు పాల్గొన్నారు

నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలి



సమావేశంలో పోస్టర్లను విడుదల చేస్తున్న నాయకులు

నస్పూర్, ఫిబ్రవరి 20: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విద్యా కాషాయీకరణ, కార్పొరేటీకరణను ప్రేరేపిస్తూ నూతన విద్యావిధానాన్ని తీసుకువచ్చే ప్రయత్నం చేస్తుందని భారత్ బచావో జిల్లా అధ్యక్షుడు కునుకుంట్ల మల్లయ్య అన్నారు. ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈనెల 25. 26 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగే సదస్సు పోస్టర్లను విడుదల చేశారు. అనంతరం మల్లయ్య మాట్లాడుతూ నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలని సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పేద, బడుగు బలహీన మధ్య తరగతి వర్గాల విద్యార్థులకు విద్యను దూరం చేసే ప్రయత్నం జరుగుతుందన్నారు. జిల్లా కార్యదర్శి ఇబ్రహీం, నాయకులు మనోహర్, సోమయ్య, రాజయ్య, శ్రావణ్, గణేష్, విక్రమ్, పాల్గొన్నారు.

తప్పుడు ధ్రువపత్రాలతో పొందిన పట్టాను రద్దు చేయాలి

బెల్లంపల్లి, ఫిబ్రవరి 20: మండలంలోని దుగ్నేపల్లి పంచాయతీలోని సర్వే నెంబరు 10/2, 11/2/అ లోని భూమిని రేవెల్లి విజయ్ పేరుపై పట్టా చేయడాన్ని ఖండిస్తూ బాధితులు మంగళవారం ఆర్డీవో హరికృష్ణ, తహసీల్దార్ ప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. బాధితులు బానయ్య, కాసిపాక విజయ్, రాజవ్వలు మాట్లాడుతూ తమ పూర్వీకులు ఈ భూమిని రఘుపతి రావు దొర దగ్గర కొనుక్కున్నామని, చాలా సంవత్సరాలుగా భూమి తమ ఆధీనంలో ఉందన్నారు. రేవెల్లి విజయ్‌కి పట్టా ఎలా జారీ చేశారో రెవెన్యూ అధికారులు రికార్డులు పరిశీలించి న్యాయం చేయాలని కోరారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

మంచిర్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 20 : బీసీ కుల గణనకు నిర్ణయం తీసుకోవడాన్ని హర్షిస్తూ మంగళవారం బీసీ సంఘం నాయకులు జిల్లా కేంద్రంలోని బస్టాండ్ వద్ద సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్‌ల చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు నీల కంఠేశ్వర్‌రావు, రంగు రాజేశం, యాకూబ్‌రెడ్డి, రాజయ్య, నరేష్, మల్లేష్, నగేష్‌గౌడ్, రమేష్, సత్తన్న, మనోజ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి సమన్వయంతో కృషి చేయాలి



గూడెంలో మొక్కను పరిశీలిస్తున్న కలెక్టర్, ఈవీఎం వీవీ ప్యాట్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

దండేపల్లి, ఫిబ్రవరి 20: గ్రామాల అభివృద్ధికి ప్రత్యేకాధికారులు సమన్వయంతో కృషి చేయాలని కలెక్టర్ సంతోష్ అన్నారు. దండేపల్లి, కర్ణపేట, నెల్కివెంకటాపూర్, కన్నెపల్లి, గూడెంలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి కిషన్, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావుతో కలిసి పర్యటించారు. పీహెచ్‌సీని పరిశీలించి మెరుగైన వైద్య సేవలు అందించాలని, ఆసుపత్రికి వచ్చే రోగులతో స్నేహపూర్వకంగా మెలగాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. నర్సరీలు, సెగ్రిగేషన్ షెడ్లు, అంతర్గత రహదారులను పరిశీలించారు. గ్రామాలలో పారిశుధ్యం లోపించకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. తడి, పొడి చెత్తలను వేర్వేరుగా సేకరించి డంపింగ్ యార్డుకు తరలించి ఉపయోగకరమైన చెత్తను సెగ్రిగేషన్ షెడ్డుకు తరలించాలన్నారు. నర్సరీలో మొక్కల సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బందికి వివరించారు. ఎంపీడీవో జేఆర్ ప్రసాద్, ఎంపీవో శ్రీనివాస్, ఈజీఎస్ ఏపీవో దుర్గదాస్, కార్యదర్శులు సనంద, సునీత, సుష్మ, నాగరాజు, ఉన్నారు.

ఈవీఎం, వీవీప్యాట్ కేంద్రం తనిఖీ

మంచిర్యాల కలెక్టరేట్: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకునే విధానాన్ని తెలుసుకునేందుకు కలెక్టరేట్‌లో ఈవీఎం, వీవీ ప్యాట్ అవగాహన కేంద్రాన్ని ఏర్పాటు చేశామని కలెక్టర్ బదావత్ సంతోష్ పేర్కొన్నారు. మంగళవారం ఈవీఎం, వీవీ ప్యాట్ అవగాహన కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో 18 సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరి వివరాలు ఓటరు జాబితాలో నమోదు చేశామని తెలిపారు. ప్రతీ ఒక్కరు ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వినోద్

తాండూర్, ఫిబ్రవరి 20: మండలంలో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే గడ్డం వినోద్‌వెంకటస్వామి మంగళవారం శంకుస్థాపన చేశారు. మాదారం టౌన్‌షిప్, తాండూర్, కిష్టంపేట, రేచిని, బోయపల్లి గ్రామపంచాయతీల్లో ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఫండ్ ద్వారా రూ.1.20 కోట్లతో నిర్మించే సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను 25 మంది లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమ్మేళనంలో పాల్గొన్నారు. పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరగా కండువాలు కప్పి ఆహ్వానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలానికి జూనియర్ కళాశాల మంజూరయ్యేలా చూస్తానని తెలిపారు. పార్టీ మండల అధ్యక్షుడు ఎండీ ఈసా, ఎంపీటీసీలు రవీందర్‌రెడ్డి, సిరంగి శంకర్, పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్‌రావు, గట్టుమురళీదర్‌రావు, శంకర్, జుబేర్, అనిల్, పాల్గొన్నారు.

ప్రభుత్వాన్ని విమర్శిస్తే ప్రజలే బుద్ధి చెబుతారు

మందమర్రిటౌన్: కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వాన్ని విమర్శించే బీఆర్‌ఎస్ నేతలకు ప్రజలే బుద్ధి చెబుతారని, పార్లమెంట్ ఎన్నికల్లో విజయం మాదేనని ఎమ్మెల్యే గడ్డం వినోద్ పేర్కొన్నారు. మంగళవారం మందమర్రిలో ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయమని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ కోట్ల రూపాయల స్కాంలకు పాల్పడిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హయాంలో రాష్ట్ర ప్రగతి పరుగులు పెడుతుందన్నారు.

వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

మంచిర్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 20: పదో తరగతి, ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో కృషి చేయాలని అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్ అన్నారు. మంగళవారం ఆయన చాంబర్‌లో డీఈవో యాదయ్య, ఏసీపీ ప్రకాష్, డీఐఈవో శైలజతో కలిసి సమావేశం నిర్వహించారు. మాట్లాడుతూ ఈ నెల 28 నుంచి మార్చి 16 వరకు ఇంటర్ పరీక్షలు జరుగుతాయని, జిల్లాలో 25 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయాలని తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని, పరీక్షల సమయంలో 144 సెక్షన్ అమలు చేయాలన్నారు. పరీక్ష సమయానికి అనుకూలంగా బస్సులు నడపాలన్నారు. పదో తరగతి పరీక్షలను మార్చి 18 నుంచి ఏప్రిల్ 2 వరకు జరుగుతాయని, 52 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శరత్‌కుమార్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

శాలివాహన ప్లాంట్‌ను ప్రారంభించాలి

సింగరేణి కోల్‌బెల్ట్ కమిటీ కార్యదర్శి ప్రభాత్

మంచిర్యాల, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): శాలివాహన విద్యుత్ ప్లాంట్‌ను తెరవాలని, ప్లాంట్ ప్రారంభించేందుకు క్రియాశీల పోరాటాలు చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ(మావోయిస్టు) సింగరేణి కోల్‌బెల్ట్ కమిటీ కార్యదర్శి ప్రభాత్ ఒక ప్రకటనలో తెలిపారు. మంచిర్యాలలో గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ పేరుతో 6 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం గల పవర్ ప్లాంట్‌ను ప్రైవేటు యాజమాన్యం ఏర్పాటు చేసిందన్నారు. ప్లాంటు నిర్మాణం పేరిట రైతుల నుంచి 60 ఎకరాల భూమిని చౌకగా కొనుగోలు చేశారన్నారు. భూములు కోల్పోయిన రైతుల కుటుంబాల్లో ఒకరికి పర్మనెంట్ ఉద్యోగం ఇప్పిస్తామని ఇన్నేళ్ళు లాభాలను ఆర్జించిన యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం బకాయిలు ఇవ్వడం లేదని, విద్యుత్ కొనుగోలు చేయడం లేదని కంపెనీ మూసివేయడం దారుణమన్నారు. 120 మంది కార్మికులకు ఏడాదిగా వేతనాలు చెల్లించడం లేదని ఆరోపించారు. కంపెనీపై ఆధారపడ్డ 600 మంది కార్మిక కుటుంబాలు జీవనోపాధి కోల్పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసి వందల కోట్ల రూపాయలు సంపాదించే ఉద్దేశంతో యాజమాన్యం కంపెనీ మూసివేతకు తెరలేపిందని పేర్కొన్నారు. శాలివాహన విద్యుత్ ఉత్పత్తి కంపెనీ నడిపించే నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు ఐక్య కూటమిగా ఏర్పడి కంపెనీని తెరిపించాలని, కార్మికుల వేతన బకాయిలు ఇప్పించేందుకు కృషి చేయాలని కోరారు.

ఉపాధిహామీ కూలీలు ఇన్సూరెన్స్ చేయించుకోవాలి

మందమర్రిరూరల్, ఫిబ్రవరి 20 : ఉపాధిహామీలో పని చేసే కూలీలు మీ సేవలో లేబర్ ఇన్సూరెన్స్ చేసుకోవాలని ఎంపీడీవో రాజేశ్వర్ సూచించారు. మంగళవారం మండలంలోని పొన్నారం గ్రామంలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వేసవి కాలం ప్రారంభమైనందున కూలీలందరు ఉదయం 7 గంటలకు పనులను ప్రారంభించి 11 గంటలలోపు ఇండ్లకు చేరుకోవాలన్నారు. నీరు వెంట తెచ్చుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో బీరయ్య, ఏపీవో రజియా సుల్తానా, కార్యదర్శి హిమబిందు ,ఫీల్డ్ అసిస్టెంట్ ఈద లింగయ్య పాల్గొన్నారు.

గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న యువకులు

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 20: శ్రీరాంపూర్ ఏరియాలో గ్రంథాలయం ఏర్పాటు చేయాలని యువకులు ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావుకు వినతిపత్రం అందిం చారు. తాము వివిధ ఉద్యోగాలకు ప్రిపేర్ అవుతు న్నామని, లైబ్రరీ లేకపోవడంతో దూర ప్రాంతాలకు వెళ్లి చదువుకోలేకపోతున్నామని, ఆర్థికంగా నష్టపోతున్నామని తెలిపారు. పాత సింగరేణి పాఠశాలలో ఖాళీగా ఉన్న గదులను గ్రంథాలయ ఏర్పాటుకు కేటాయించేలా సింగరేణి జీఎంను ఆదేశించాలని కోరారు. లైబ్రరీ ఏర్పాటు వల్ల సమీప గ్రామాలతో పాటు పట్టణ యువతకు ఉపయోగకరంగా ఉం టుందని తెలుపగా సంబంధిత అధికారులకు ఆదే శాలు జారీ చేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో శ్రీపెల్లి రాజు, విజయ్‌రాజు, గణపతి, మహేష్, ప్రవీణ్, సాగర్, తదితరులు పాల్గొన్నారు.

గైర్హాజరైన అధికారులపై చర్యలు తీసుకోవాలి

వేమనపల్లి మండల సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కోలి స్వర్ణలత

వేమనపల్లి, ఫిబ్రవరి 20 : మండల సమావేశానికి హాజరు కాని అధికారులపై చర్యలు తీసుకోవాలని సభ్యులు డిమాండ్ చేశారు. మంగళవారం ఎంపీపీ కోలి స్వర్ణలత అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. మూడు నెలలకు ఒకసారి జరిగే మండల సర్వసభ్య సమావేశాలకు అధికారులు గైర్హాజరు కావడంతో సమస్యలను ఎవరికి చెప్పుకోవాలని సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీటీసీ ఆదె చంద్రకళ మాట్లాడుతూ గైర్హాజరవుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. పీఏసీఎస్ చైర్మన్ కుబిడె వెంకటేశం మాట్లాడుతూ సబ్‌స్టేషన్ పనులను త్వరగా పూర్తి చేసి రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరాను అందించాలని కోరారు. ఎంపీటీసీ దాగామ బాపు మాట్లాడుతూ ఫెర్టిలైజర్ డీలర్లు అధిక ధరలకు ఎరువులను విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు.

ఎంపీపీ కోలి స్వర్ణలత మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి అధికారులు కృషి చేయాలని సూచించారు. వైద్య సిబ్బంది గ్రామాల్లో అందుబాటులో ఉండాలన్నారు. ఎంపీడీవోగా పనిచేసి బదిలీపై వెళ్లిన లక్ష్మయ్యను సన్మానించారు. ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ గణపతి, ఎంపీవో బాపురావు, తహసీల్దార్ రమేష్, వైద్యాధికారి రాజేష్, పీఆర్ ఏఈ శ్రీధర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నరేష్, వ్యవసాయాధికారి వీరన్న, ఏపీవో సత్య ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

బెల్లంపల్లి, ఫిబ్రవరి 20 : విద్యార్థులు ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని బెల్లంపల్లి సీఐ అఫ్జలుద్దీన్ పేర్కొన్నారు. మంగళవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమ శిక్షణతో చదువుకోవాలని విద్యార్థులు టీనేజ్‌లో తప్పుడు నిర్ణయాలు తీసుకోకుండా, చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ చదువుకుని మంచి స్థాయికి చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రవీణ్‌కుమార్, ప్రిన్సిపాల్ శ్రీలత, ఎస్ఐ నరేష్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహానికి వినతి

ఏసీసీ, ఫిబ్రవరి 20: మంచిర్యాల పట్టణంలోని ఐబీ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహానికి జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి నాయకులు మంగళవారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో 50 శాతం రిజర్వేషన్‌లు బీసీలకు కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర జనాభాలో 56 శాతం బీసీలుంటే బీసీ ఉద్యోగులు 9 శాతం మాత్రమే ఉన్నారని, కేంద్రంలో 60 శాతం జనాభా ఉంటే 14 శాతం మాత్రమే బీసీ ఉద్యోగులున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుమ్ముల శ్రీనివాస్, రాములు తదితరులు పాల్గొన్నారు.

సినిమా వార్తల కోసం www.andhrajyothy.comను క్లిక్ చేయండి

రైలు కింద పడి మహిళ ఆత్మహత్య

ఏసీసీ, ఫిబ్రవరి 20 : మంచిర్యాల పట్టణంలోని రాజీవ్‌నగర్ సమీపంలోని రైలు పట్టాలపై తమిళనాడు ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి గుర్తుతెలియని మహిళ (43) ఆత్మహత్య చేసుకుందని రైల్వే హెడ్ కానిస్టేబుల్ సురేష్‌గౌడ్ తెలిపారు. మృతురాలు వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని, ఎల్లో కలర్ బ్లౌజ్, లైట్ ఎల్లో కలర్ చీర ధరించి ఉందన్నారు. మృతదేహాన్ని మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో భద్రపర్చామన్నారు. 9948481902లో సంప్రదించాలన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

తాండూర్, ఫిబ్రవరి 20: తాండూర్‌కు చెందిన ఎస్‌కె సాబీర్‌అలీ (49) మంగళవారం గెస్ట్‌హౌజ్ వెనుక మద్దిబోయిన భీమయ్య అనే రైతు పొలంలోని నీట కుంటలో అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. పొలం యజమాని పొలానికి వెళ్లగా నీటి కుంటలో పడి ఉన్న మృతదేహాన్ని చూసి పోలీసులకు సమాచారం అందించారు. కుంటలో నుంచి మృతదేహాన్ని బయటకు తీసి సాబీర్‌అలీగా నిర్ధారించారు. సాబీర్‌అలీ ప్రైవేటు ఎలక్ట్రిషియన్‌గా పని చేస్తున్నాడు. కొన్ని రోజుల నుంచి మతిస్థిమితం లేకుండా తిరుగుతున్నాడని, అదృశ్యం కాగా మూడు రోజుల క్రితం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారని పోలీసులు తెలిపారు. మృతుడి సోదరుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ మనోహర్ తెలిపారు.

విద్యార్థులు భయం వీడి పరీక్షలకు సిద్ధం కావాలి

ఏసీసీ, ఫిబ్రవరి 20: విద్యార్థులు పరీక్షలపై భయాన్ని వీడాలని డీఈవో యాదయ్య అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని మైనార్టీ ఫంక్షన్ హాలులో హాజీపూర్, నస్పూర్ మండలాల ప్రభుత్వ పాఠశాలల పదో తరగతి విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు పరీక్షలపై భయాన్ని పోగొట్టేందుకు సైకాలజిస్టు, సబ్జెక్టు నిపుణులతో, ప్రభుత్వ అధికారులతో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సైకాలజిస్టు శ్రీహరి మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులకు నెల రోజులు చాలా కీలకమని, పక్కా ప్రణాళికతో సిద్ధమైతే నూరు శాతం ఫలితాలు సాధ్యమవుతాయన్నారు. ఎంఈవోలు సతీష్, శ్రీనివాస్‌రెడ్డి, డీసీబీ సెక్రటరీ భీంరావు,కుమారస్వామి, పాల్గొన్నారు.

కోటపల్లి: పదో తరగతి విద్యార్థులు భయం వీడి పరీక్షలకు సిద్ధం కావాలని సైకాలజిస్టు శ్రీహరి అన్నారు. మంగళవారం కోటపల్లి, వేమనపల్లి మండలాలకు చెందిన పలు పాఠశాలల పదో తరగతి విద్యార్థులకు రైతువేదికలో పరీక్షల సంసిద్ధతపై అవగాహన, ప్రేరణ కార్యక్రమం నిర్వహించారు. భయాలు, బలహీనతలు అధిగమించి పరీక్షల్లో ఏ విధంగా విజయం సాధించాలో అవగాహన కల్పించారు. అనంతరం వివిధ సబ్జెక్టు నిపుణులు మార్కులు సాధించడంపై చేపట్టాల్సిన చర్యలపై వివరించారు.



నెన్నెలలో మాట్లాడుతున్న ఎంఈవో మహేశ్వర్‌రెడ్డి

ఎంపీపీ మంత్రి సురేఖరామయ్య, జిల్లా విద్యాశాఖ సెక్టోరల్ అధికారి చౌద రి, డీసీఈబీ సెక్రెటరీ భీంరావు, ఎంఈవో తిరుపతిరెడ్డి, మండల సూపరింటెండెంట్ లక్ష్మయ్య, ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, ఎంపీవోలు అక్తర్ మొహియొద్దీన్, బాబురావు ఉన్నత, మోడల్ స్కూల్, కేజీబీవీ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సీఆర్‌పీలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

నెన్నెల: విద్యతోనే పేరు, ప్రతిష్ఠలు వస్తాయని మండల విద్యాధికారి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. పదో తరగతి విద్యార్థులకు నెన్నెల రైతువేదికలో నిర్వహించిన ప్రేరణలో ముఖ్య అతిథిగా మాట్లాడారు. పదో తరగతి జీవితంలో ఒక మైలురాయి లాంటిదన్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకొని చదవాలన్నారు. జీవితంలో ఉన్నత స్థానంలో స్థిర పడి జన్మనిచ్చిన తల్లిదండ్రులకు, చదువు నేర్పిన గురువులకు మంచిపేరు తేవాలని సూచించారు.

విజయ సంకల్ప యాత్రను విజయవంతం చేయాలి

ఏసీసీ, ఫిబ్రవరి 20: విజయ సంకల్ప యాత్రను విజయవంతం చేయాలని బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి తుల ఆంజనేయులు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 23 నుంచి జిల్లాలో విజయ సంకల్ప యాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ దేశానికి చేసిన పనులు, సాధించిన అభివృద్ధి, రాష్ట్రానికి కేంద్రం విడుదల చేసిన నిధులు, పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. ఈ నెల 23న తాండూర్‌లో యాత్ర ప్రారంభమై 24న ఇందారంలో ముగుస్తుందన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ నేతృత్వంలో యాత్ర జరుగుతుందన్నారు. హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బెల్లంపల్లి: విజయ సంకల్ప యాత్రను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ యాత్ర ప్రముఖ్ అమురాజులు శ్రీదేవి అన్నారు. మంగళవారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈ నెల 23న బస్సు యాత్ర జిల్లాలోని తాండూర్ మండలానికి చేరుకుంటుందని, అనంతరం బెల్లంపల్లి పట్టణంలోని పాత బస్టాండ్ నుంచి రోడ్‌షోగా కాంటా చౌరస్తా వరకు చేరుకొని అక్కడ బహిరంగ సభ ఉంటుందని తెలిపారు. సభకు బీజేపీ జాతీయ, రాష్ట్ర నాయకులు హాజరవుతారని తెలిపారు. నాయకులు, కార్యకర్తలు, ప్రజలు విజయవంతం చేయాలని కోరారు. శ్రీకృష్ణదేవరాయలు, సంతోష్, గోవర్ధన్, రాజలింగు, కేశవరెడ్డి, రాజులాల్‌యాదవ్, కళ్యాణి,మహేష్ పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న శ్రీదేవి

యువత వ్యసనాలకు దూరంగా ఉండాలి

భీమారం, ఫిబ్రవరి 20: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఎస్‌ఐ రాములు పేర్కొన్నారు. మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ యువత గంజాయి, గుట్కా తదితర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. మత్తు పదార్థాలు సరఫరా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకొంటామన్నారు. అపరిచిత వ్యక్తులకు బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీ, పిన్ నెంబర్లు చెప్పవద్దన్నారు. న్యాయపరమైన సమస్యలుంటే నేరుగా పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేయడం జరుగుతుందని, ప్రజలందరు సహకరించాలని కోరారు.

స్థలం కబ్జాపై కమిషనర్‌కు ఫిర్యాదు

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 20: ఆర్‌కె 6 కొత్తరోడ్డు ప్రాంతంలో రోడ్డు కబ్జాకు గురవుతుందని పేర్కొంటూ ప్రజలు నస్పూర్ మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఖాళీగా ఉన్న మున్సిపల్ స్థలం సెంటర్‌లో ఉండడంతో కొందరు కబ్జా చేయడానికి ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఈ ఏరియాకే చెందిన ఓ వ్యక్తి డ్రెయినేజీపై నిర్మాణం చేపడుతూ అధికారుల అనుమతితోనే నిర్మిస్తున్నానని తమను బెదిరిస్తున్నాడన్నారు. ఈ స్థలం వద్ద ఆర్‌టిసి బస్సులు ఆగుతున్నాయని పేర్కొన్నారు. అధికారులు కబ్జాను అడ్డుకోవాలని వారు కోరారు.

ప్రభుత్వ భూములను కబ్జా చేస్తే చర్యలు

హాజీపూర్, ఫిబ్రవరి 20 : ప్రభుత్వ భూములను కబ్జా చేస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ సతీష్‌కుమార్ హెచ్చరించారు. మంగళవారం గుడిపేట శివారులోని సర్వే నెంబరు 197, 198, 199లోని ప్రభుత్వ భూమి చుట్టూ స్తంభాలు పాతించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వ భూములను చదును చేశారని, అందుకే స్తంభాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రభుత్వ భూములను ఎవరైనా కబ్జా చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఆర్‌ఐ ప్రభ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఇవ్వాలి

బెల్లంపల్లి, ఫిబ్రవరి 20: బెల్లంపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఇవ్వాలని 28వ వార్డు మాజీ కౌన్సిలర్ రామగిరి లావణ్యశ్రీనివాస్ మంగళవారం ఎమ్మెల్యే గడ్డం వినోద్‌కు వినతిపత్రం అందించారు. ఎస్సీ మహిళ కోటాలోకి కేటాయించారని, తనకు ఇవ్వాలని విన్నవించారు.

ఘనంగా యాదయ్య వర్ధంతి

మంచిర్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 20: రాష్ట్ర సాధన కోసం ఆత్మబలిదానం చేసుకున్న పద్మాశాలీల ముద్దుబిడ్డ సిరిపురం యాదయ్య వర్ధంతిని ఐబీ చౌరస్తాలో మంగళవారం మార్కండేయ పద్మశాలి స్వచ్ఛంద సంస్థ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు గజెల్లి వెంకటయ్య, రాములు, చంద్రమౌళి, రాజేశం, పాల్గొన్నారు.

ఘనంగా భీష్మ ఏకాదశి

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 20 : గీతా సత్సంగం వార్షికోత్సవం, భీష్మ ఏకాదశిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆర్‌కె 8 కాలనీ గీతామందిరంలో ఉదయం పూజా కార్యక్రమాలు, అన్న ప్రసాద వితరణ, అనాథలకు వస్త్ర దానం నిర్వహించారు. దాసరి భక్త రాజేం, ఆనందం, ప్రసాద్, సారయ్య, మనోహర్, రాంబాబు, పాల్గొన్నారు.

నేడు పీఎం కిసాన్ ప్రత్యేక శిబిరం

జన్నారం, ఫిబ్రవరి 20: దేవునిగూడ రైతువేదికలో కవ్వాల్ క్లస్టర్ పరిధిలోని రైతులు ఈ కేవైసీ, ఆధార్ లింక్ చేసుకోని వారు, పీఎం కిసాన్‌కు సంబంధించి సందేహాలు నివృత్తికి బుధవారం ప్రత్యేక శిబిరం నిర్వహిస్తున్నట్లు ఏఈవో సయ్యద్ అక్రమ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బాక్సింగ్ జిల్లా జట్టు ఎంపిక



ఎంపికైన జట్టుతో బాక్సింగ్ అసోసియేషన్ సభ్యులు

భీమారం, ఫిబ్రవరి 20: బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సబ్ జూనియర్ జిల్లా జట్టు ఎంపికను మంగళవారం ఆశ్రమ పాఠశాలలో నిర్వహించినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు పాదం రవీందర్ తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 21, 22 తేదీల్లో లాలగూడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులకు బాక్సింగ్ సీనియర్ కోచ్, బాక్సింగ్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి రాజ్‌కుమార్‌లు అభినందించారు. ప్రిన్సిపాల్ దాసరి బాలకృష్ణ, పీఈటీ శ్రీకాంత్, బాక్సింగ్ కోచ్ జగత్ సాయి, సీనియర్ క్రీడాకారుడు జయకృష్ణ, గణేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

గాంధారి మైసమ్మ జాతర పోస్టర్ల విడుదల

కాసిపేట, ఫిబ్రవరి 20 : మందమర్రి మండలంలోని బొక్కలగుట్టలో ఈ నెల 23 నుంచి 25 వరకు జరిగే గాంధారి ఖిలా మైసమ్మ జాతర పోస్టర్లను నాయకపోడ్ సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంగళవారం దేవాపూర్‌లో విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ యేటా జాతరను ఘనంగా నిర్వహిస్తామన్నారు. జాతరకు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు. ఆలయ కమిటీ చైర్మన్ రొడ్డ రమేష్, రొడ్డ రాజం, ఆడె జంగు,రెడ్డి లక్ష్మణ్,గడ్డం భీమయ్య,రమణారెడ్డి, సోయం సింగ్ , కనకరాజు , రవీందర్, శ్రీనివాస్,మల్లేష్ పాల్గొన్నారు.

హైపవర్ కమిటీ వేతనాలు ఇప్పించాలి

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 20: హైపవర్ కమిటీ వేతనాలు ఇప్పించాలని సింగరేణి కాంట్రాక్టు కార్మికులు మంగళవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో నిర్వహించిన ప్రజావాణిలో వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు డి బ్రహ్మానందంతదితరులు పాల్గొన్నారు.

ఓఅండ్ఎం చీఫ్‌గా సింగరేణి అధికారిని నియమించాలి

జైపూర్, ఫిబ్రవరి 20: ఎస్టీపీపీలో ఓఅండ్ఎం చీఫ్‌గా సింగరేణి అధికారిని నియమించాలని హెచ్ఎంఎస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. 137 సంవత్సరాల చరిత్ర ఉన్న సింగరేణి సంస్థకు పవర్ ప్రాజెక్టులపై పూర్తి అనుభవం ఉన్నప్పటికీ కావాల్సిన ఇంజనీరింగ్ అధికారులు ఉన్నా పదవీ విరమణ పొందిన అధికారులను నియమించడం సింగరేణి చరిత్రకే సిగ్గు చేటని తెలిపారు.

తాగునీటి సమస్య రాకుండా చూడాలి

- ఏజెన్సీ గ్రామాలపై దృష్టి సారించాలి
- జడ్పీ సీఈవో అనిల్‌కుమార్

సిర్పూర్(టి), ఫిబ్రవరి 20: మండలంలో ప్రతి గ్రామంలో వేసవి కాలం దృష్ట్యా తాగునీటి సమస్య రాకుండా చూడాలని జడ్పీ సీఈవో అనిల్‌కుమార్ అన్నారు. సిర్పూర్(టి) ఎంపీడీవో కార్యాలయాన్ని మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సత్యనారాయణ, ఎంపీవో కృష్ణమూర్తి, సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని అన్ని గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఏజెన్సీ గ్రామాలపై దృష్టి సారించాలన్నారు. ఈజీఎస్ పనులు ఎంత వరకు వచ్చాయని ఏపీవో రామ్మోహన్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంపీడీవో సత్యనారాయణ, ఎంపీవో కృష్ణమూర్తి, సూపరింటెండెంట్ వీణ, సీనియర్ అసిస్టెంట్ సదాశివ్, జూనియర్ అసిస్టెంట్ రాజ్‌కుమార్, ఈజీఎస్ సిబ్బంది ఉన్నారు.

పెంచికలపేట: గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని జడ్పీ సీఈవో అనిల్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని మండలపరిషత్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. మండలంలో చేపడుతున్న ఉపాధిహామీ పనులపై ఆరా తీశారు. నర్సరీల నిర్వహణ పకడ్బందీగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది ఆయనను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో గంగాసింగ్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



జడ్పీ సీఈవోకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంపీడీవో

బెజ్జూరు: గ్రామాల్లోని పరిసరాలు వీధులు పరిశుభ్రంగా ఉంచాలని జడ్పీ సీఈవో అనిల్ కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో మాధవి, ఎంపీవో రమేశ్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ సోహెల్ పాల్గొన్నారు.

కౌటాల: అన్ని మండలాల్లో, గ్రామాల్లో వేసవి తాగునీటి ఎద్దడి లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జడ్పీ సీఈవో అనిల్‌కుమార్ అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో వంద శాతం పన్నులు వసూలు చేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఏవో తోటాజీ, మహేందర్, ఎంపీడీవో నస్రుల్లాఖాన్ పాల్గొన్నారు.

హత్య కేసులో ఇద్దరికి జీవిత ఖైదు

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 20: వ్యక్తిని హత్య చేసిన కేసులో ఇద్దరి నిందితులకు జీవిత ఖైదు విధిస్తూ ఆసిఫాబాద్ జిల్లా సెషన్స్ కోర్టు ప్రధాన న్యాయాధికారి ఎంవీ రమేశ్ తీర్పు ఇచ్చారు. కోర్టు లైజనింగ్ ఆసిఫాబాద్ ఎస్‌ఐ సాగర్, ఆసిఫాబాద్ సబ్ డివిజన్ లైజనింగ్ ఆఫీసర్ రామ్‌సింగ్ తెలిపిన వివరాల ప్రకారం.. 2021లో సిర్పూర్(యూ) మండలం దనోర గ్రామానికిచెందిన సెడ్మాకి తుకారాం(50)పై అదే గ్రామానికి చెందిన సెడ్మాకి నాందేవ్, సెడ్మాకి భీంరావులపై హత్య కేసు నమోదైంది. ఈ మేరకు పీసీ జగన్మోహన్‌రావు కోర్టులో సాక్షులను ప్రవేశ పెట్టగా హత్య నేరం రుజువు కావడంతో నిందితులు నాందేవ్, భీంరావులకు సెక్షన్ 32 ఐపీసీ ప్రకారం జీవితకాలం జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ.4 వేల చొప్పున జరిమానా విధించారు. నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన ప్రస్తుత జైనూరు సీఐ అంజయ్య, ప్రస్తుత సిర్పూర్(యు) ఎస్పై రాజు, కోర్టు సిబ్బందిని ఎస్పీ సురేష్‌కుమార్ అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి స్వల్ప గాయాలు

వాంకిడి, ఫిబ్రవరి 20: వాంకిడి మండలంలోని గణేశ్‌పూర్ గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై మంగళవారం ఎదురెదురుగా రెండు వ్యాన్‌లు ఢీకొన్న ప్రమాదంలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. వాంకిడి నుంచి వ్యాన్(ఏపీ 01 డబ్ల్యూ 9276) చంద్రాపూర్‌కు పత్తి లోడ్ తో వెళ్తున్నది. అదే సమయంలో ఎదురుగా వస్తున్న మరో వ్యాన్ (టీఎస్ 19టీ 5668) ఢీ కొట్టింది. దీంతో చంద్రాపూర్‌కు వెళ్తున్న వ్యాన్ బోల్తా పడింది. ఈ ప్రమా దంలో డ్రైవర్ తారాచంద్‌కు స్వల్ప గాయాలయ్యాయి. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్పై సాగర్ తెలిపారు.

28న రేషన్ బియ్యం బహిరంగ వేలం

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 20: వివిధ కారణాలతో స్వాధీనం చేసుకొని జిల్లాలోని ఐదు ఎంఎల్ఎస్ పాయింట్‌ల వద్ద నిలువ ఉంచిన 3,373.50 క్వింటాళ్ల బియ్యం ప్రభుత్వ ఆదేశాల మేరకు 28వతేదీన బహిరంగ వేలం నిర్వహించనున్నామని జిల్లా పౌరసరఫరాల అధికారి తారామణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి పాట కేజీకి రూ.21గా నిర్ణయించామని పేర్కొన్నారు. లోకల్ ట్రేడర్స్, డిస్టిలరీల వారికి మాత్రమే అవకాశం ఉంటుందని తెలిపారు.

నాణ్యమైన విద్య అందించాలి

జైనూర్, ఫిబ్రవరి 20: గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడానికి ఉపాధ్యా యులు కృషి చేయాలని ఏసీఎంవో పుర్కు ఉద్ధవ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాల ఆవరణలో జైనూర్, సిర్పూర్ (యు), లింగాపూర్ మండలాల ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గిరిజన ప్రాంత విద్యార్థులకు గుణాత్మకమైన అందించావాల్సిన అవసరం ఉందన్నారు. పాఠశాలల రిజిస్టర్లు సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో ఏటీడీవో పురుషోత్తం, ప్రధానోపాధ్యాయులు అనిత, మండాడి సోనేరావు, ఆత్రం చొక్కారావు, ఏసీఆర్పీలు కనక బుచ్చిరాం, సిర్నోల మారుతి, ఉయక శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సాగు భూములను వెంచర్లు చేయొద్దు

కాగజ్‌నగర్, ఫిబ్రవరి 20: వ్యవసాయ సాగు భూములను వెంచర్లు చేయొద్దని తహసీల్దార్ కిరణ్‌కుమార్ అన్నారు. కాగజ్‌నగర్ మండలం ఈసుగాం శివమల్లన్న ఆలయ సమీపంలో ఏర్పాటు చేసిన వెంచర్‌ను మంగళవారం తహసీల్దార్ పరిశీలించారు. వెంచర్‌లో ఏర్పాటు చేసిన స్తంభాలను సిబ్బంది చేత తొలగింపజేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఏజెన్సీ ఏరియాలో వెంచర్లు ఏర్పాటు చేయొద్దని సూచించారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

రెబ్బెన, ఫిబ్రవరి 20: రెబ్బెన గ్రామపంచాయతీలో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద రూ.4లక్షలతో చేపట్టే సీసీ రోడ్డు పనులను మంగళవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు విశ్వప్రసాద్ రావు ప్రారంభించారు. కార్యక్రమంలో ఆసిఫాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి అజ్మీర శ్యాం, నాయకులు లావుడ్యా రమేశ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దుర్గం దేవాజీ, సీనియర్ నేత సుదర్శన్‌గౌడ్, మురళీ, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి

దహెగాం, ఫిబ్రవరి 20: విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించి ఉన్నతగా ఎదగాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అమరేందర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కళాశాలలో నిర్వహించిన వార్షికోత్సవంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లక్ష్మణ్‌రావు, రాందాస్, పరశురాములు, అధ్యాపకులు అమరేందర్, బాబాజీ పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి స్పందన

కౌటాల, ఫిబ్రవరి 20: మండల కేంద్రంలోని మన్నెవార్ సేవా సంఘం భవనంలో మంగళవారం అనంత శ్రీ విభూషిత్ జగద్గురు రామానందచార్య, శ్రీ నరేంద్రచార్య మహరాజ్ సంస్థాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి స్పందన లభించింది. ఈ రక్తదాన శిబిరాన్ని కౌటాల ఎంపీపీ మధుకర్ ప్రారంభించారు. సుమారు 101 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో సంస్థ జిల్లా ము ఖ్యులు దిలీప్ గైక్వాడ్, కుశాల్‌రావు మహరాజ్, పండరి, సత్యనారాయణ గౌడ్, భావురావు, జీవన్‌దార బ్లడ్ బ్యాంకు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.







ఆసిఫాబాద్ బస్టాండు నుంచి మేడారం వెళ్తున్న భక్తులు

80 బస్సులు

- ఆసిఫాబాద్, బెల్లంపల్లిలో పాయింట్ల ఏర్పాటు
- జిల్లా నుంచి వెళ్లే ప్రజలు ఇబ్బందులు పడకుండా చర్యలు
- మహిళలకు ఉచిత ప్రయాణం
- మహాలక్ష్మి పథకంతో పెరుగనున్న రద్దీ
- ఏర్పాట్లు పూర్తి చేసిన ఆర్టీసీ అధికారులు

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 20: కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా నుంచి మేడారం జాతరకు ఆర్టీసీ అధికారులు 80 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. మేడారం సమ్మక్క- సారలమ్మ జాతరకు అధికంగా తరలి వెళ్లనున్న నేపథ్యంలో ఆర్టీసీ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ ప్రత్యేక బస్సులను ఆసిఫాబాద్, బెల్లంపల్లి రెండు పాయింట్ల ద్వారా నడుపుతున్నారు. మేడారం జాతరకు వెళ్లే మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించనున్నారు. గతంలో జాతర సమయంలో 65 బస్సులు మాత్రమే రాకపోకలు సాగించాయి. కాగా ఈ సారి ప్రయాణికుల రద్దీ మేరకు అదనంగా మరో 15 బస్సులను నడిపిస్తున్నారు. ఇందుకోసం ఆసిఫాబాద్ డిపోలోని 35 బస్సులు, ఉట్నూరు డిపోకు చెందిన 10, బోధన్ డిపోకు చెందిన 35 బస్సులతో పాటు డ్రైవర్, కండక్టర్లను ఆసిఫాబాద్ డిపోకు తెప్పించి వారికే విధులను కేటాయించారు. మొత్తం 80 బస్సులను జాతరకు ఏర్పాటు చేశారు.

మహాలక్ష్మి పథకంలో..

మహాలక్ష్మి పథకంలో భాగంగా మేడారం జాతరకు మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పించనున్నారు. మహిళలు ఒరిజినల్ ఆధార్ కార్డు తప్పని సరిగా వెంట తీసుకుని రావాలని ఆర్టీసీ అధికారులు సూచి స్తున్నారు. ఆధార్ కార్డులలో పాత ఫొటోలు, చిన్న నాటి ఫొటోలు ఉన్న మహిళలు తప్పని సరిగా అప్‌డేట్ చేసుకోవాలని బస్సు తనిఖీ సమయంలో తనిఖీ అధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తారని ఆధార్ కార్డు తమ వెంట తీసుకు రావాలని పేర్కొంటున్నారు. మహిళలకు జాతరకు ఉచిత ప్రయాణం కల్పించడంతో ఈ సారి బస్సులనీ రద్దీతో కిటకిట లాడుతున్నాయి.

ఆసిఫాబాద్ డిపో పరిధిలో..

మేడారం జాతరకు ఆసిఫాబాద్ డిపో పరిధిలో ఆర్టీసీ అధికారులు ఆసిఫాబాద్, బెల్లంపల్లి పాయింట్లను ఏర్పాటు చేసి 80 బస్సులను సోమవారం నుంచి నడుపుతుంది. జాతరకు బస్సులు, ఆసిఫాబాద్, బెల్లంపల్లి, గోదావరిఖని, మంథని, కాటారం, భూపాలపల్లి, గోవింద్‌రావు పేట, పస్రల మీదుగా మేడారం జాతరకు చేరుకుంటాయి. మేడారం జాతర ముగించుకుని బస్సులు తిరుగుతు ప్రయాణంలో ఆసిఫాబాద్ వైపు రావాలంటే మేడారం బస్‌స్టేషన్‌లో 15 నెంబర్ క్యూలైన్ వద్ద ఉండాలని ఆర్టీసీ అధికారులు సూచిస్తున్నారు. ఆసిఫాబాద్ నుంచి మేడారంకు టికెట్ ధర పెద్దలకు రూ.550, పిల్లలకు రూ.300, బెల్లంపల్లి నుంచి పెద్దలకు రూ. 470, పిల్లలకు రూ.260గా నిర్ణయించారు. బస్సులలో భక్తులు కోళ్ళు, మేకలు తీసుకు పోవడా నికి అనుమతి లేదని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. భక్తులు ఈ విషయాన్ని గమనించి ఆర్టీసీ సిబ్బందికి సహకరించాలని కోరుతున్నారు.

జాతరకు ప్రత్యేక బస్సులు..

శ్రీధర్, ఆసిఫాబాద్ డిపో మేనేజర్



మేడారం జాతరకు ఆసిఫాబాద్ డిపో నుంచి 80 ప్రత్యేక బస్సులను నడుపుతున్నాం. ఇందు కోసం ఆసిఫాబాద్, బెల్లంపల్లి పాయింట్లను ఏర్పాటు చేశాం. మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం ఉంటుంది. ఒరిజినల్ ఆధార్ కార్డు తప్పని సరిగా వెంట తీసుకుని వెళ్లాలి. జాతరకు ఈ సారి రద్దీ పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో గతంలో కంటే అదనంగా 15 బస్సులను నడుపుతున్నాం. భక్తులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలి. ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకుంటూ సిబ్బందికి సహకరించాలి.

ప్లాస్టిక్ రహిత సమాజం కోసం కృషి చేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే

కాగజ్‌నగర్, ఫిబ్రవరి 20: జిల్లాలో ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ఐక్యగా కృషి చేద్దామని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. మంగళవారం ఎస్పీఎం ఆడిటోరియంలో స్పర్శ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్లాస్టిక్ వాడకంతో ప్రజలు వివిధ రోగాల బారిన పడుతున్నట్టు తెలిపారు. అలాగే క్యాన్సర్ రోగుల సంఖ్య క్రమేణా పెరుగుతున్నారని చెప్పారు. ప్లాస్టిక్ పరిశ్రమల్లో వెలువడే రసాయనాలతో క్యానర్స్ వచ్చినట్టు నిర్ధారణ జరిగిందన్నారు. రానున్న తరాల వారు ఆరోగ్య వంతంగా ఉండాలంటే ప్లాస్టిక్ వాడకం పూర్తిగా తగ్గించాలన్నారు. ప్లాస్టిక్ నష్టాలపై జేకే మిల్లు ఆధ్వర్యంలో చేపడుతున్న వివిధ అవగాహన కార్యక్రమాలు భేష్‌గా ఉన్నాయని కొనియాడారు. అదనపు కలెక్టర్ దీపక్ తివారి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్లాస్టిక్ వినియోగం తగ్గించేందుకు వివిధ రకాల చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్లాస్టిక్ నిర్మూలిద్దామని ప్రతిజ్ఞ చేయించారు. ఎస్పీఎం వైస్ ప్రసిడెంట్ ఏకే మిశ్రా మాట్లాడుతూ ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలతో వచ్చే వివిధ వ్యాధుల పట్ల అందరికి అవగాహన కల్పించేందుకు వివిధ కార్యక్రమాలు చేపడుతున్నట్టు తెలిపారు. సమావేశంలో ఆర్డీవో సురేష్, మున్సిపల్ కమిషనర్ అంజయ్య, ఎస్పీఎం ప్రతినిధులు కపిల్ కౌల్, ప్రబోత్ సోదీ, గిరి, రీనా, జోర్జ్, సుందరం, ఆశోక్, సుశీల పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికలకు సమన్వయంతో పని చేయాలి

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 20: వచ్చే పార్లమెంట్ ఎన్నికలు జిల్లాలో సజావుగా సాగేందుకు రాజకీయ పార్టీలు తమ సహకారం అందించి అధికార యంత్రాంగంతో కలిసి పని చేయాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ సమావేశ మంది రంలో మంగళవారం అదనపు దీపక్ తివారి, ఆర్డీవో లోకేశ్వర్‌రావుతో కలిసి గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వచ్చే పార్లమెంట్ ఎన్నికల నిర్వహణలో భాగంగా జిల్లాలోని సిర్పూర్, ఆసిఫాబాద్ నియోజకవర్గాలలో అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో చేపట్టిన ఓటరు జాబితా సవరణ కార్యక్రమం- 2024లో భాగంగా తుది ఓటరు జాబితా విడుదల చేశామని తెలిపారు. ఫారం 6, 7,8 ద్వారా మొత్తం 24,104 దరఖాస్తులు రాగా 21,332 దరఖాస్తులు విచారించి ఆన్‌లైన్‌లో నమోదు చేశామని చెప్పారు. 720 దరఖాస్తులను ఎన్నికల సంఘం నిబంధనల మేరకు తిరస్కరించామని తెలిపారు. కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

గంగాపూర్ జాతరను విజయవంతంగా నిర్వహించాలి

రెబ్బెన, ఫిబ్రవరి 20: గంగాపూర్ గ్రామ శివారులోని శ్రీ బాలాజీ వేంకటేశ్వర స్వామి సన్నిధిలో ఈ నెల 23, 24, 25 తేదీల్లో నిర్వహించనున్న గంగాపూర్ జాతరను విజయవంతం చేయాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. గంగాపూర్ ఆలయం వద్ద జాతర కర పత్రాలను మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జాతర సందర్భంగా వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ దీపక్ తివారి, జీఎం రవిప్రసాద్, సీఐ చిట్టి బాబు, ఎంపీపీ సౌందర్య, జడ్పీటీసీ సంతోష్, సింగిల్ విండో చైర్మన్ సంజీవ్ కుమార్, డీఆర్‌డీవో సురేందర్, తహసీల్దార్ జ్యోత్స్న, ఉమర్, ఎంపీడీవో శంకరమ్మ, ఎఫ్‌డీవో రాజేశ్వర్, ఈఓ బాపిరెడ్డి పాల్గొన్నారు.

తహసీల్దార్‌గా దత్తు ప్రసాద్

కెరమెరి, ఫిబ్రవరి 20: కెరమెరి తహసీల్దార్‌గా దత్తు ప్రసాద్ మంగళవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేసిన మునావర్‌షరీఫ్ కలెక్టరేట్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో మంచిర్యాల జిల్లాలో పని చేస్తున్న దత్తు ప్రసాద్ కెరమెరికి బదిలీపై వచ్చారు.

భూమి ప్రజాప్రయోజనాలకు అప్పగించాలి

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 20: జిల్లాలోని పెంచికలపేట మండలం ఎల్లూరు గ్రామ సమీపంలోని సర్వే నంబరు 61లో ఉన్న భూమిని ప్రజా ప్రయోజనాలకు అప్పగించాలని ఆ గ్రామ ప్రజలు జిల్లా రెవెన్యూ అధికారి లోకేశ్వర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గ్రామ సమీపంలోని సర్వే నంబరు 61లో 1,250 ఎకరాల రెవెన్యూ భూమి ఉందన్నారు. దీనిలో ఇప్పటికే కొంతమందిపేద ప్రజలు సాగులో ఉన్నారని వివరించారు. వారికి 30 ఏళ్ల క్రితం పట్టాలు ఇచ్చారన్నారు. అది పోను మిగితా భూమి ప్రజా ప్రయోజనాలకు ఉపయోగించాలని గతంలో మండల కేంద్రంలోని అన్ని రకాల కార్యాలయాల కోసం ప్రతిపాదనలు పంపించారని తెలిపారు. కాగా అటవీ శాఖ అధికారులు ఆ భూమి తమకు సంబంధించిదేనని, ఎవరైనా అక్రమణకు ప్రయత్నిస్తే కేసు నమోదు చేస్తామని బెదిరింపులకు గురి చేస్తున్నారని అన్నారు. ఆ భూమిని గ్రామ ప్రయోజనాలకు వినియోగించాలని కోరారు. కార్యక్రమంలో పెంచికలపేట ఎంపీటీసీ రాజం, మాజీ సర్పంచ్ కావ్య, సంతోష్, మధుకర్, శ్రీనివాస్, తిరుపతి, రాజన్న, రాంచందర్ పాల్గొన్నారు.

సమ్మక్క జాతరకు ఏర్పాట్లు పూర్తి


ముస్తాబైన సమ్మక్క గద్దె

కాగజ్‌నగర్, ఫిబ్రవరి 20: కాగజ్‌నగర్ పెద్దవాగు సమీపంలో నిర్వహించే సమ్మక్క, సారలమ్మ జాతరకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా జాతర కమిటీ ఆధ్వర్యంలో సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. రెండేళ్లకు ఒకసారి నిర్వహించే ఈ జాతరకు జిల్లా నలుమూల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై మొక్కులు చెల్లించుకుం టారు. కాగజ్‌నగర్ పెద్దవాగు సమీపంలో 2018 నుంచి జాతర నిర్వహిస్తు న్నారు. జాతర కమిటీ అధ్యక్షుడు తుమ్మ రమేశ్ ఆధ్వర్యంలో సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పెద్దవాగు స్నానాలు చేసే వారికి సౌకర్యం కల్పించారు. జాతరలో దుకాణాల కోసం ప్రత్యేక స్థలాన్ని కేటాయించారు. రద్దీ పెరిగే అవకాశం ఉండడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు. బుధవారం సారలమ్మ, గోవింద రాజు, పగిడింద‌రాజు, జంపన్నలను వనం నుంచి తీసుకు రానున్నారు. గురువారం సమ్మక్కను వనం నుంచి తీసుకు వస్తారు. శుక్రవారం భక్తులకు దర్శనార్థం అనంతరం శనివారం సాయంత్రం వన ప్రవేశం చేయి స్తారు. కాగజ్‌నగర్ పోచమ్మ గుడి నుంచి బుధవారం సాయంత్రం అమ్మవారి రాక సందర్భంగా బొట్టు, తదితర వస్తువులతో శోభాయాత్ర చేపట్టనున్నారు. జాతర కమిటీ అధ్యక్షుడు తుమ్మ రమేశ్ మాట్లాడుతూ సమ్మక్క, సాలరమ్మ జాతరకు భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. భక్తులు రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. బుధవారం సారలమ్మ, గోవింద రాజు, పగిడిందరాజు, జంపన్న వనం నుంచి తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు.

జన జాతరకు వేళాయె..

నేటి నుంచి మేడారం కుంభమేళా ప్రారంభం

- నేడు గద్దెకు చేరుకోనున్న సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజులు
- నాలుగు రోజుల పాటు పూజలందుకోనున్న వనదేవతలు

వరంగల్, ఫిబ్రవరి (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మేడారం జనారణ్యం అవుతోంది. వనదేవతల ఆగమనానికి వేళవుతుండటంతో భక్తులతో మేడారం పోటెత్తుతోంది. ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న అద్భుత క్షణాలు బుధవారం సాక్షాత్కరించనున్నాయి. తొలిరోజు సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజులు గద్దెకు చేరుకుంటారు. ఈ నేపథ్యంలో మేడారం జనగుడారమవుతోంది. ఎడ్లబండ్లు, కాలి నడకన, కార్లు, ఆటోలు, జీపులు, బస్సుల్లో భక్తులు మేడారం చేరుకుంటున్నారు.




మేడారం జాతరకు తరలివస్తున్న భక్తులు

నేటి నుంచి జాతర

తెలంగాణ కుంభమేళాగా పిలిచే మేడారం సమ్మక్క, సారలమ్మ జాతర బుధవారం నుంచి ప్రారంభం కానుంది. రెండేళ్లకోసారి మాఘశుద్ధ పౌర్ణమిన రోజైన బుధవారం నుంచి శనివారం వరకు నాలుగు రోజుల పాటు ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని దట్టమైన అరణ్యంలోని మేడారంలో జరిగే ఈ మహాజాతరకు తెలుగు రాష్ట్రాలతో పాటు పొరుగున ఉన్న ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఒరిస్సా రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా తరలివస్తారు. పూర్తిగా ఆదివాసీ సంప్రదాయ పద్ధతిలో జరిగే ఈ జాతరలో ప్రకృతే దైవంగా.. వనదేవతల స్మారకార్థం నిర్మించిన కర్రల వద్దే పూజలు నిర్వహిస్తారు. వనదేవతలకు పసుపు, కుంకుమ, ఒడి బియ్యం, ఎదుర్కోళ్ల తో పాటు బంగారాన్ని (బెల్లం) మొక్కుగా చెల్లిస్తారు.

గద్దెపైకి చేరిన జంపన్న

జాతర నేపథ్యంలో సమ్మక్క తనయుడు జంపన్న కన్నెపల్లి నుంచి మంగళవారం రాత్రి 8గంటలకు జంపన్న వాగు ఒడ్డునున్న గద్దెకు చేరుకున్నారు. పోలెబోయిన వంశీయులు పూజారి సత్యం ఆధ్వర్యంలో పగిడె రూపంలో ఉన్న జంపన్నను గద్దెపై కొలువుదీర్చి పూజలు చేశారు.


సమ్మక్క గద్దె


సారలమ్మ గద్దె

నేడు గద్దెకు చేరనున్న సారలమ్మ

జాతర తొలిరోజున కన్నెపల్లి ఆడపడుచు సారలమ్మ గద్దెపైకి రానుంది. సారలమ్మ కొలువైన పల్లె కన్నెపల్లిలో బుధవారం ఉదయమే ప్రధాన పూజారి కాక సారయ్య ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. సారయ్యతోపాటు మిగతా పూజారులు ఆలయాన్ని శుద్ధి చేసి అలికి ముగ్గులతో అలంకరిస్తారు. సాయంత్రం ఆలయంలో ఆదివాసీ పూజారులు రహస్య పూజలు జరుపుతారు. ఈ సమయంలోనే పూజారి సారయ్యను సారలమ్మ ఆవహిస్తుంది. సారయ్యకు పూనకం రావడంతో ఆలయం నుంచి గద్దెల వైపు పూజారులు సారలమ్మను తీసుకవ స్తారు. కన్నెపల్లి మీదుగా తన తమ్ముడు జంపన్నను పలకరిస్తూ జంపన్నవాగును పూజారులు దాటుతారు. ఈ సమయంలోనే శివసత్తుల పూనకాలతో భక్తుల పుణ్యస్నానాలతో జంపన్నవాగు పులకరిస్తుంది. కన్నెపల్లి నుంచి మేడారంలో ఉన్న సమ్మక్క ఆలయానికి సారలమ్మ చేరుకుంటుంది.


వనదేవతలకు మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

పగిడిద్దరాజు, గోవిందరాజుల రాక

మంగళవారం మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం పూనుగొండ్ల నుంచి సమ్మక్క భర్త పగిడిద్దరాజు మేడారం బయలుదేరారు. ఆదివాసీలు కాలినడకన పగిడిద్దరాజును పడిగె రూపంలో తీసుకుని బుధవారం సాయంత్రానికి మేడారంలోని సమ్మక్క గుడికి చేరుకుంటారు. ఇక పగిడిద్దరాజు తమ్ముడు గోవిందరాజులు కూడా బుధవారమే ఏటూరునాగారం మండలం కొండాయి నుంచి బయలుదేరి, మేడారం చేరుకుంటారు. సమ్మక్క ఆలయంలో ముగ్గురికి ప్రత్యేక పూజలు చేస్తారు. అనంతరం రాత్రి 8గంటలకల్లా మేడారంలోని గద్దెలపైకి చేరుకుంటారు. దీంతో తొలిరోజు జాతర అట్టహాసంగా ప్రారంభం అవుతుంది.

23న మొక్కులు

జాతరలో మూడోరోజు శుక్రవారం గద్దెలపై సమ్మక్క, సారలమ్మల తోపాటు పగిడిద్దరాజు, గోవిందరాజులు చేరుకోవటంతో భక్తులు రాత్రి పగలు తేడా లేకుండా మొక్కులు చెల్లించేందుకు బారులు తీరుతారు. 23వ తేదీ శుక్రవారం వనదేవతలకు మొక్కులు చెల్లింపులు చేస్తారు. తీరొక్క మొక్కులతో వనదేవతలను శరణ కోరుతారు.

22న సమ్మక్క ఆగమనం

జాతరలో రెండోరోజైన గురువారం 22న మేడారంలోని చిలుకలగుట్టపై రహస్య ప్రాంతంలో సమ్మక్క ప్రధాన పూజారి కొక్కెర కిష్టయ్యతో పాటు వడ్డెలు మునిందర్, బొక్కయ్య ప్రత్యేక పూజలు చేస్తారు. అనంతరం కుంకుమ భరణె రూపంలో ఉన్న సమ్మక్కను తీసుకుని ప్రధాన పూజారి కిష్టయ్య చిలుకలగుట్టపై నుంచి కిందకు వస్తున్న క్రమంలో ములుగు ఎస్పీ గాలిలోకి కాల్పులు జరిపి సమ్మక్క రాకను స్వాగతిస్తారు. ఆ సమయంలో కోట్లాది భక్తుల జయజయ నినాదాలతో మేడారం హోరెత్తుతుంది. సమ్మక్క ఆగమనంతో దారి పొడువునా వేలాది మేకలు, గొర్రెలు, కోళ్ల తలలు తెగి రక్తం చిందిస్తాయి. పూజారులు అత్యంత భక్తిశ్రద్ధలతో రాత్రి 10గంటల కల్లా సమ్మక్క గద్దెకు చేరుకోవటంతో మహాజాతర తుది ఘట్టానికి చేరుకుంటుంది.

24న వనప్రవేశం

జాతరలో చివరి రోజైన నాలుగో రోజు శనివారం సాయంత్రం 6గంటలకు సమ్మక్క తిరిగి చిలుకలగుట్టకు తిరుగు ప్రయాణం అవుతుంది. సమ్మక్క వన ప్రవేశంతో సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజులు కూడా వారి స్వగ్రామాలకు పయనం అవుతారు. దీంతో జాతర ముగుస్తుంది.


కన్నెపల్లి నుంచి జంపన్నను గద్దెపైకి తీసుకొచ్చి ప్రతిష్ఠిస్తున్న వడ్డెలు


మేడారం దారిలో వాహనాల బారులు..


మంగపేట మండలం కమలాపురం నుంచి ఎడ్లబండ్లపై జాతర కొస్తున్న భక్తులు

